

# ముసుగు మనిషి

పాలకోడేటి సత్యనారాయణ రావు

చలపతి కథలు రాస్తుంటాడు. అందరి లాగా అతను ప్రేమకథలు రాయడు; ఓ అబ్బాయి మరో అమ్మాయి అతని కథల్లో ఎపుడూ కలుసుకోరు. డబ్బుండే హీరో తన నల్ల కళ్ళజోడులోంచో, కాడిలాక్ కారులోంచో, ఇంపాలాలోంచో అందంగా ఆనందంగా తారు రోడ్డుకేసో, కాకపోతే పక్కనే నడుస్తున్న మరో మహిళామణి వైపో అతని కథల్లోంచి చూడనే చూడడు.

చలపతి స్వతహాగా డబున్నమనిషే- ఎందుకంటే అతని హాబీలన్నీ కొంచెం డబ్బున్న మనిషికి ఉండేవే. హాబీ డబ్బుండేదే అయితే ఆహాబీ ఓనరూ డబున్నవాడే!

కానీ చలపతి రాసే కథల్లో డబ్బు కనబడదు డబ్బు కనపడకపోవటం వల్ల కలిగే కష్టాలన్నీ చలపతి కథల్లో కాపురం ఉంటుంటాయి.

చలపతి రాసే కథలన్నీ ఈ సంఘపు అట్టడుగు మనిషి గురించి. ఆ మనిషి కోసమే తన కథలు. తన కథలన్నీ ఆ మనిషిని మరో అడుగు పైకి తీసుకెళ్ళ గలిగితే, అంతకన్న తను కానీ, తన కథలు కానీ సాధించగలిగేది ఏదీ ఉండదు- అనే ఊహలో ఉంటాడు చలపతి.

—ఇంత చలపతి గురించి చెప్పానంటే దానికి కారణం అతనంటే నాకున్న మంచి అభిప్రాయమే!

నాకూ కొంచెం కథలు రాసే అలవాటు ఉంది. ఎంత ఆలోచించినా నా కథలు మాత్రం అబ్బాయి అమ్మాయిల సంకెళ్ళ లోంచి బయటపడలేవు. అందుకే నేను రాయలేని కథలు,చలపతి రాయటంవల్లనే, అతను రాయగలగటం వల్లనే, చలపతి అంటే అభిమానం పెంచుకొన్నాను.

* * *

“ఎవరికీ ఇవ్వని వస్తువు మీకు ఇస్తున్నాను. జాగ్రత్తగా చూసుకొండి సుమా!” అన్నాడు చలపతి కెమెరా అందిస్తూ.

“ఫర్వాలేదండి, జాగ్రత్తగానే తెస్తా! అక్కడ మా ఫ్రెండ్ ఫోటో స్టూడియో ఉంది. కానీ అతనికి వీల్లేకపోవటంవల్లనే మీ కెమెరా తీసుకెడుతున్నాను.” అన్నాను నేను కెమెరాను చూసుకొంటూ

కెమెరా చూస్తోంటే ముచ్చటగా ఉంది. వెలుతురులో, చీకట్లో మనుషుల స్వభావాల్ని, మనుషుల్ని శాశ్వతంగా దాచగలిగే సాధ్యం! నా చుట్టూ ఉన్న ప్రపంచంలో ఓ చిన్న భాగం కెమెరా అద్దంలోంచి కనిపిస్తూ ఉంది.

కెమెరాలో ఉన్న భాగాలన్నీ జాగ్రత్తగా చూపించి, అవి ఎలా ఎలా పని చేస్తాయో చెప్పాడు చలపతి. అతను చెప్పినవన్నీ మళ్ళీ మర్చిపోతాననే భయం ఉండటంవల్ల, అన్నీ కాగితం మీద రాసుకొన్నాను.

చలపతి ఎవ్వరికీ ఇవ్వని కెమెరా నాకు ఇచ్చాడు. ఆ అమూల్యమైన వస్తువును జాగ్రత్తగా పట్టుకొని ఆ ఇంటిలోంచి బయటపడ్డాను.

* * *

వారం గడిచింది. చలపతికి చెప్పిన దాన్ని బట్టి ఆ రోజు నేను కెమెరా తిరిగి ఇచ్చేయాలి. సాయంత్రం వరకూ ఏవేవో పనులు చేసుకొన్న తర్వాత వీధి దీపాలు వెలిగాక, చలపతి ఇంటికేసి నడిచాను. నేను వెళ్ళినపుడు చలపతి ఇంట్లోనే ఉన్నాడు. నవ్వుతూ పలకరించాడు

"ఎలా వచ్చాయి ఫొటోలు?"

నాకు నవ్వొచ్చింది. ఏం చెప్పను? మంచి కెమెరాతో తీసిన ఫోటోలు బాగా వచ్చాయి అని అబద్ధం చెప్పనా? లేకపోతే ఆ కెమెరా సరిగ్గా ఉపయోగించుకోలేక పోయాము, ఫోటోలు ఒక్కటీ రాలేదు అని నిజం చెప్పనా??


ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాను.

"చెప్పండి, ఎలావచ్చాయి ఫొటోలు?" అనడిగాడు చలపతి.

నవ్వలేక, ఏడ్వలేక చెప్పాను— ఫోటోలు ఏమీ రాలేదని. నెగటివ్ అంతా తెల్లగా ఏ విధమైనా మచ్చా లేకుండా వచ్చింది.

నొచ్చుకుంటూ అన్నాడు చలపతి— "సారీ—ఇలాటి సొఫిస్టికేటెడ్ కెమెరాతో ఇదే బాధ. వస్తే చాల బాగా వస్తాయి, లేకపోతేఅంతే.అయినా మీకిది కొత్తకదా! సారీ- కెమెరా ఉపయోగపడలేదు కదా!"

చలపతి అనునయం నాకు బాధను ఎక్కువ చేసింది.



"పోనీండి. మీరు మాత్రం ఏం చేస్తారు? " అన్నాను నేను.

చలపతి కెమెరా అందుకొని, పైన ఉండే లెదర్ కవర్‌తీసి చూశాడు. అటూ ఇటూ తిప్పి చూశాడు. ఆ తర్వాత నెమ్మదిగా అన్నాడు చలపతి—"ఇదేమిటి, ఇలా అయిపోయింది?"

అటుకేసి చూశాను—అక్కడ అలా ఏం జరిగిందో నాకు తెలీదు.

"ఏం జరిగింది?

"ఇదుగో—" అంటూ ఓ చిన్న

స్క్రూ దగ్గర చెయ్యిపెట్టి అన్నాడు—

"ఇక్కడ! ఈ స్క్రూ లూజ్ అయిపోయిందే!"

చూశాను. నిజమే! చలపతి చెప్పినట్లుగా ఆ స్క్రూ లూజ్‌అయిపోయింది. ఆ విషయం నేనూ ఇపుడే గమనించాను. అది అలాగే ఉందో, నా దగ్గరే అలా అయిందో తెలీలేదు—

"నిజమే. సారీ వేరే స్క్రూ వేయించి ఇస్తాలెండి" అన్నాను నేను.

చలపతి నాకేసి ఒకసారి ఆశ్చర్యంగా చూశాడు "అంటే?"—

"దీన్ని తీసుకెళ్ళి వేరే స్క్రూ వేయించి తీసుకొస్తా" అన్నాను మళ్ళీ. చలపతి నేనన్నది అర్థం కానట్లుగా అన్నాడు "అలా కుదరదండీ. ఎంత కొత్త స్క్రూ వేసినా, దాని ఒరిజినల్ వాల్యూ పోయినట్లేగదా!"

"ఒక్క స్క్రూ వల్ల!"

"ఆ, ఒక్క స్క్రూవల్లనే!—ఓ పని చెయ్యండి. ఈ కెమెరా ఎలాగూ పాడయిపోయింది!!"

షాక్ తినేశాను నేను.

"ఒక్క స్క్రూ లేకపోతే— అదీ లూజయిపోగానే కేమెరా పాడయిపోయినట్లేనా?"

"ఆ—ఆ స్క్రూ బదులు వేరేదివేయించినా, దాని విలువ తగ్గిపోయినట్లే గదా!"

"విలువ తగ్గచ్చునేమోగానీ, పాడయి

---


# ఆంగ్లేయబోధిని

పిన్నలు, పెద్దలు ఆంగ్లము రానివారు మా ఆంగ్లేయబోధిని సహాయంతో 60 దినములలో ఆంగ్లము నేర్చుకొనవచ్చును వెల: రూ 10/-

# తమిళ్-తెలుగు స్వబోధిని


తమిళభాష రానివారు మా తమిళ-తెలుగు స్వబోధిని సహాయంతో 35 దినములలో తమిళం నేర్చుకొనవచ్చును వెల: రూ. 3/-

# హిందీ-తెలుగు స్వబోధిని

హిందీ భాషను అతి సులభముగా అందరు 30 దినములలో హిందీ-తెలుగు స్వబోధినిద్వారా అతి త్వరలో నేర్చుకొనవచ్చును వెల: రూ. 4/-

పై వాటికి పోస్టేజి అదనము.

బాలసరస్వతీ బుక్ డిపో (ఫోన్: 29868) .: మద్రాసు 600 001



'సోగ్గాడు'గా తెలుగు ప్రేక్షకుల హృదయాలు దోచిన శోభన్ బాబు ఇప్పుడు 'పొగరుబోతు'గా రాబోతున్నాడు. నిర్మాత దర్శకుడు తాతినేని ప్రకాశరావు తమ అనిల్ ప్రొడక్షన్స్ పతాకం క్రింద నిర్మిస్తున్న కలర్ చిత్రం 'పొగరుబోతు'.

నట్లు కాదు గదా!"

"నాకు విలువ తగ్గటం ఎంతో పాడవటమూ అంతే!" చలపతి కంఠం కొంచెం తీవ్రంగా ఉంది.

పరిస్థితి విషమిస్తున్నట్లుగా తెలుస్తూనే ఉంది అయినా తప్పు నాది. అందుకే అన్నాను "సరే, ఏంచెయ్యమంటారుమరి?"

"అదే చెబుతున్నా ఈ కెమెరా మీరు తీసుకోండి. నేను వేరేది కొనుక్కుంటా!"

చలపతి అన్నది బాగానే ఉంది ఎలాగూ కొత్త కెమెరా కొనే ఊహలోనే ఉన్నాను. పోనీ, ఇదే తీసుకొంటే

"సర్లెండి అయితే కానీ, ఒక్క-అనటం ఏమీ బాగలేదు."

దానికి చలపతి ఏమీ అనలేదు. క్షణం తర్వాత అన్నాడు "చెప్పండి - ఓ వెయ్యి రూపాయలు ఇచ్చేసి "

"ఎంత?" విన్నది రైటేనా అనే అనుమానంతో అడిగాను.

నేను విన్నది నిజమే! చలపతి అంటున్నది 'వెయ్యిరూపాయలు!'

పక్కున నవ్వేశాను.

"మీరుకొన్నదిఅయిదువందలకేగదా!"

"అవును!"

'మరి వెయ్యిరూపాయలు అంటారేం?'

'అవును!'అన్నాడు చలపతి దృఢంగా.

అయిదు వందలకు మూడేళ్ల క్రిందట! ఇపుడు దాని విలువ తగ్గాలే గానీ ఇలా పెరగటం ఏమిటి?"

చలపతి నాకేసి చూస్తూ అన్నాడు—"నేను కొన్నది అయిదొందలకే' కాదనను. అదీ మూడేళ్ళ కిందటే! కాదనను కానీ ఇపుడు నేను కొనుక్కోవాలంటే ఇలాటిదే మూడొందలకు కాదు వచ్చేది, వెయ్యి రూపాయలు అవుతుంది. అందుకని వెయ్యి రూపాయలు ఇమ్మంటున్నాను.''

చలపతి అంటోంది వింటోంటే నాకు నవ్వొచ్చింది "అంటే ఆఫ్టరాల్ ఆ స్క్రూ కోసం నాకు మీరు వేస్తున్న ఫైన్ వెయ్యి రూపాయలా? అన్యాయం!"

"కెమెరా మీకు ఇచ్చినందుకు పాడు చేసి ఇవ్వటం మీరు నాకు ఇచ్చే బహుమతి కాబోలు! అది అన్యాయం కాదూ!"

"పొరబాటున పాడయిపోయింది కాబోలు!"

"కాబోలు ఎందుకు మళ్ళీ! పాడయిపోయింది. స్పష్టంగా కనిపిస్తూంటే."

"అవును పాడయిపోయింది. కానీ, అందుకు వెయ్యిరూపాయలు "

"అవును పాడుచేయటం మీరు చేశారు. ఇపుడది బాగుపడ్డా దాని విలువ పోయినట్లే. అందుకే నేను కొత్తది కొనుక్కోవాలనుకొంటున్నా "

"మీ కొత్తది రెండు వేలు అయితే."

"మీరు రెండు వేలే ఇవ్వాల్సి ఉంటుంది. అయినా కొత్తదాని విలువ వెయ్యికన్నా కొంచెం ఎక్కువ. వెయ్యి మీరు ఇవ్వండి ఆ మిగిలింది, మీకు ఈ కెమెరా ఇచ్చినందుకు నాకు శిక్ష అనుకొని నేను వేసుకొంటాను!" చలపతి అన్నాడు.

తప్పు చేశాను. ఎరువు సొమ్ము బరువు చేటు అని తెలిసీ తీసుకోవటం తెలివి తక్కువ పని. కానీ ఇంత ఘోరంగా వలలో పడిపోవటం

కానీ నేనుఇది నేర్చుకోవాల్సిన పాఠం. వెయ్యి రూపాయల జుల్మానాతో నేర్చుకోవాల్సిన అగత్యం రావటమే కొంచెం దురదృష్టం—

చలపతికి ఆ తర్వాత వాయిదాల మీద వెయ్యి రూపాయలు ఇచ్చేశాను

రెండు నెలలు గడిచాయి ఇంట్లో ఏదో పత్రిక తిరగేస్తోంటే చలపతి కథ కనబడింది. చదివాను. మధ్య తరగతి మనుషుల్నీ, అట్టడుగు మనుషుల్నీ, తమను దోచుకొంటున్న వారిమీద తిరగబడమని ప్రబోధించే కథ.

నాకు నవ్వొచ్చింది—

చలపతి ముసుగులో ఉన్న మనిషి. పైకి కనిపించడానికి వేసుకొన్న రంగులు వేరు, మనిషి వేరు— అవకాశం వస్తే అందర్నీ దోచుకోవడానికి కాచుకుని కూర్చున్న వ్యక్తి చలపతి. ఇన్నాళ్ళూ అవకాశం రాలేదు కాబట్టి మడి కట్టుకొని కూర్చున్నాడు ఆ 'మడి టైంలో' దోపిడీదారులను ఎదుర్కోమని ప్రబోధించే కథలు రాస్తాడు. అవకాశం రాగానే

నాకూ కొంచెం జ్ఞానోదయంఅయింది. ఇపుడు నేను చలపతి నేర్పిన పాఠాలవల్ల ప్రేమ కథలు రాయటం మానేసాను. దోపిడీ కథలు, దోపిడీదార్ల కథలు, తిరుగుబాటు కథలూ ఇవే రాయగలుగుతున్నాను.

చలపతికి వచ్చిన అవకాశం నాకు ఇంకా రాలేదు—అందుకే కథలు పుష్కలంగా రాసేస్తున్నాను ★